సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



అదే జోరు .. అదే హోరు

'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జట్ల మధ్య హోరాహోరీగా జరుగుతున్నాయి.

-8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,660
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,329
3 శాతం జీఎస్టీతో	రూ.5,489
సవర (8 గ్రా)	రూ.43,912

గరిష్టం/కనిష్టం

31.1 /23.5

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా శనివారం వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ 70 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండడంతో పగలు వెచ్చగా, రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామాయపట్నం పోర్టుకు భూసేకరణపై సమీక్ష



మాట్లాడుతున్న కందుకూరు ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

నెల్లూరు(అర్బన్): రామాయపట్నం పోర్టు భూసేకరణకు సంబంధించిన ప్రజలకు ఆమోదయోగ్యమైన, న్యాయమైన మంచి ప్యాకేజీ ఇచ్చేందుకు, ఇబ్బందులు లేకుండా భూసేకరణ జరపడం తదితర అంశాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, కలెక్టర్ చక్రధర్‌బాబు, ఇతర అధికారులు భూసేకరణపై చర్చించారు. నిర్వాసితులకు పునరావాసం, మౌలిక వసతుల కల్పనపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, డీఆర్వో వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

97.21 శాతం పింఛన్ల పంపిణీ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 6 డివిజన్ జనిగలవారివీధికి చెందిన శ్రీరాములకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటసాయితేజ

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. జిల్లాలో 3,10,010 మంది లబ్ధిదారులకు నగదు అందజేయాల్సి ఉండగా శుక్రవారం మూడో రోజుకు 3,01,371 మందికి పంపిణీ చేశారు. 97.21 శాతం పంపిణీ పూర్తయింది. ఈ నెల 5వ తేదీ వరకు మిగిలిన వారికి పంపిణీ చేయనున్నారు.

సోమశిలలో 68.216 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం నాటికి 68.216 టీఎంసీల నీరు ఉన్నాయి. జలాశయానికి 1738 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 3,920, ఉత్తరకాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.240 మీటర్ల నీటి మట్టం ఉంది.

మెడికల్ కళాశాల, జీజీహెచ్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వివిధ రకాల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్టు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డియాలజి టెక్నీషియన్, డెంటల్, ల్యాబ్ అటెండెంట్, లైబ్రేరీ అసిస్టెంట్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, న్యూక్లియర్ ఫిజిస్ట్, స్టెరిలైజేషన్ టెక్నీషియన్, క్యాథ్‌ల్యాబ్, పోస్టుమార్టమ్/మెచ్యూరిటీ అటెండెంట్, సీటీ స్కాన్ టెక్నీషియన్, రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్ తదితర పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. వివరాలను ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవి.ఇన్/నోటీసు/రిక్రూట్ మెంట్ అనే వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 10వ తేదీలోపు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు పెద్దాస్పత్రి, మెడికల్ కళాశాలలో తమ దరఖాస్తులను అందజేయాలన్నారు.

ప్యాకేజీ.. మింగేశారు

పోర్టు నిర్మాణంతో బతుకుదెరువు కోల్పోయి నిరాశ్రయులైన పేదలకు అందాల్సిన నిధులను టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన అనుచరులు స్వాహా చేశారు. అధికారంలోకి వచ్చిన టీడీపీ ఐదేళ్లు ఇదిగో.. అదిగో అంటూ ఊరించి కాలయాపన చేసింది. ఎన్నికల సమయంలో ముత్తుకూరు మండలంలో ఓట్ల కోసం హడావుడిగా నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీ నిధులను సోమిరెడ్డి మంజూరు చేయించారు. ఆ నిధులను ఆయన, అనుచరులే బొక్కేశారు. రికార్డుల్లో మాత్రం లబ్ధిదారులకు అందినట్లు చూపించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగే అభివృద్ధిని అవినీతిగా ప్రచారం చేస్తూ నిత్యం ఎల్లో మీడియా పతాక శీర్షికల్లో ఉండే సోమిరెడ్డి తన అవినీతి నిర్వాకానికి మాత్రం సమాధానం చెప్పరు.



- ఎన్నికల సమయంలో నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీ మంజూరు
- రూ.1.22 కోట్ల పేదల సొమ్ము టీడీపీ నేతల జేబుల్లోకి
- 300 మంది నగదును పక్కదారి పట్టించిన సోమిరెడ్డి అనుచరులు
- రికార్డుల్లో మాత్రం ప్యాకేజీ నిధుల పంపిణీ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్యాకేజీ కింద రూ.35 కోట్ల మంజూరు
- పారదర్శకంగా లబ్ధిదారులకు పంపిణీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రానికే తలమానికంగా కృష్ణపట్నం పోర్టును 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. అప్పట్లో పోర్టు ఆధారిత పరిశ్రమల కోసం భూ సేకరణ చేశారు. దీంతో ఉపాధి కోల్పోయిన నిర్వాసితుల కోసం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించారు. మత్స్యకార కుటుంబాల తరలింపునకు, కొంత కాలం ఉపాధి కోసం ఒక్కొక్కరికి రూ.1.20 లక్షల చొప్పున రూ.32 కోట్లు అందించారు. వీరితో పాటు మత్స్యకారేతరులను గుర్తించి వారికి ప్యాకేజీ అందించాలని వైఎస్సార్ నిర్ణయించారు. అయితే వైఎస్సార్ అకాల మరణం నాన్ ఫిషర్‌మెన్ కుటుంబాల పాలిట శాపంగా మారింది. ఆ తర్వాత పాలన కొనసాగించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్యాకేజీని బుట్టదాఖలు చేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.43 వేలకుపైగా ప్యాకేజీ అందిస్తామని కొంత కాలం మభ్యపెట్టింది. అయితే ఇందులో ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే మూడు విడతల్లో ఇస్తానని చెప్పడంతో అప్పటి సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏకమైన మత్స్యకారేతర కుటుంబాలు రోడ్డెక్కి ఆందోళనలు చేశాయి. అయినా ఫలితం లేకుండా పోయింది. ప్రతిపక్ష నేత హోదాలో ప్రజాసంకల్పయాత్ర చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మత్స్యకారేతర కుటుంబాల సమస్యను విన్నారు. అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ విషయంలో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల ముందు వరకూ తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి మత్స్యకారేతర కుటుంబానికి ప్యాకేజీ అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఎన్నికల ముందు హడావుడిగా..

టీడీపీ హయాంలో ఐదేళ్ల పాటు నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీని పట్టించుకోని అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో వారి ఓట్ల కోసం కేవలం ఎస్సీ, ఎస్టీలకే అంటూ ప్రత్యేకంగా రూ.4.09కోట్లు మంజూరు చేయించారు. హడావుడిగా 3,550 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10,500 వంతున రూ.3.87 కోట్లు పంపిణీ చేయించారు. ఇంకా రూ.1.22 కోట్లు పంపిణీ చేయకుండా అప్పట్లో ఆ నగదు పంపిణీలో సోమిరెడ్డి, ఆయన అనుచరులు చేతివాటం ప్రదర్శించారు. చెక్కుల రూపంలో పంపిణీ జరగడంతో రెవెన్యూ అధికారులు మాత్రం లబ్ధిదారులకు పంపిణీ జరిగినట్లు చూపించారు. కానీ లబ్ధిదారుల పేరుతో టీడీపీ నేతలే బ్యాంకు కెళ్లి డ్రా చేసుకుని ఆరగించారు. మండలంలోని పంటపాళెం, పైనాపురం, నేలటూరు, ముత్తుకూరు, దొరవులపాళెం గ్రామాల్లో దాదాపు 300 మందికి సంబంధించిన నగదును టీడీపీ నేతలే దిగమింగారు.

కాకాణి చొరవతో 16,337 కుటుంబాలకు లబ్ధి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపించారు. ప్రజాసంకల్పయాత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పారదర్శకంగా 16,337 కుటుంబాలను లబ్ధిదారులను గుర్తించారు. ఒక్కొక్కరికి రూ.25 వేల వంతున రూ.35.75 కోట్లు కేటాయించి, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయించారు. టీడీపీ హయాంలో రూ.10,500 మాత్రమే లబ్ధి పొందిన వారికి సైతం మిగతా రూ.14,500 వంతున ప్యాకేజీ అందించారు.

నాకు ప్యాకేజీ ఇవ్వకుండానే..



నాకు నాన్‌ఫిషర్‌మెన్ ప్యాకేజీ కింద డబ్బులు పంపిణీ చేసినట్లు రికార్డుల్లో ఉంది. నాకు మాత్రం అందలేదు. నా పేరు మీద చెక్కురాసి తీసేసుకున్నారు. టీడీపీ నేతలే ఈ పని చేశారు. మా కడుపులు కొట్టి ఇలా ప్రవర్తించడం వాళ్లకే చెల్లింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్యాకేజీ మంజూరు చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాత్రం ప్రతి ఒక్క కుటుంబానికి అందేలా చూశారు.

– కర్లపూడి సుబ్రహ్మణ్యం, ముత్తుకూరు

ఇచ్చిన మాట ప్రకారం ప్యాకేజీ



కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజాసంకల్పయాత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి మా సమస్యను తీసుకెళ్లారు. అప్పుడు ఇచ్చిన హామీ ప్రకారమే మాకు నిధులు పంపిణీ చేయించారు. టీడీపీ హయాంలో ప్యాకేజీ పేరుతో మోసం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసినా ఫలితం లేదు. ఎన్నికల సమయంలో మాకు నిధులు ఇస్తున్నట్లు చెప్పి మా పేర్లతో టీడీపీ నేతలు తినేశారు.

– సుబ్బరాయుడు, దొరవులపాళెం

పొదుపు మహిళలకు అదనపు ఆదాయం కల్పించాలి

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



ఆహార ఉత్పత్తుల యంత్రాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు

నెల్లూరు (అర్బన్): ఆసక్తి ఉన్న, అర్హత ఉన్న పొదుపు మహిళలకు అదనపు ఆదాయం వచ్చే విధంగా జీవనోపాధులను కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో పొదుపు ఏరియా కో–ఆర్డినేటర్లు (ఏసీలు), ఏపీఎంలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళలు నిరంతరం చేసే ఉపాధి పనులే కాకుండా నాణ్యమైన ఆహార ఉత్పత్తులను పెంచే జీవనోపాధులు కల్పించాలన్నారు. అందుకు అవసరమైన యంత్రాలను అందించాలన్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసి మార్చి లోపు ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం ఐబీ, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి తదితర కార్యక్రమాలను మండలాల వారీగా సమీక్షించారు. ఇదే సందర్భంలో గ్రామీణ ఫార్మర్స్ ఫౌండేషన్ పాప్‌కార్న్, పిండి యంత్రాలు, పల్వనైజర్స్, కారం తయారీ యంత్రం, మినీ రైస్ మిల్ వంటి ఆహార ఉత్పత్తుల యంత్రాలను తెచ్చి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి వాటి పనితీరు గురించి అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో ఏపీడీ రాజు, డీపీఎం ఎల్‌హెచ్ డాక్టర్ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉన్న పేద పిల్లలకు విదేశీ విద్య

- కలెక్టర్ చక్రధర్‌బాబు
- రూ.63.78 లక్షలను జమ చేసిన ప్రభుత్వం



విదేశీ విద్యాదీవెన మెగా నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు

నెల్లూరు (అర్బన్): గొప్పింటి బిడ్డలకే సొంతమైన విదేశీ విద్యను ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా అందిస్తున్నారని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యాదీవెన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా విదేశాల్లో చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు మొదటి విడత నగదును బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చక్రధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు హాజరయ్యారు. జిల్లాకు సంబంధించి విదేశీ విద్యను అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకున్న 8 మంది విద్యార్థులకు మొదటి విడత ఫీజు కింద రూ.63,78,693 మెగా చెక్కును కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీలు తమ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభ కలిగి పేదరికంతో విదేశీ విద్యను చదవలేమని బాధ ఏ పేద విద్యార్థికి ఉండకూడదనే ఉన్నతాశయంతోనే ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. విదేశీ విద్యకు అవసరమయ్యే విమాన, వీసా, అడ్మిషన్ ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నాలుగు విడతలుగా ప్రభుత్వం నగదు విడుదల చేస్తుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో 100 యూనివర్సిటీల్లో ర్యాంకు పొందిన విద్యార్థులకు 100 శాతం ఫీజును అంటే ఒక్కొక్కరికి రూ.కోటికి పైగా అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. 200 యూనివర్సిటీల్లో ఎక్కడైనా ర్యాంకు పొందిన విద్యార్థులకు రూ.75 లక్షల వరకు ప్రభుత్వం నాలుగు వాయిదాల్లో నగదు జమ చేస్తుందన్నారు. ఈ పథకం విద్యార్థులకు ఒక వరమన్నారు. జిల్లాలో ఇద్దరు ఎస్సీ విద్యార్థులు, ఇద్దరు మైనార్టీలు, ఒక బీసీ విద్యార్థి, ముగ్గురు ఈబీసీ విద్యార్థులకు ప్రభుత్వం మొదటి విడత ఫీజును చెల్లించింది. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి కనకదుర్గాభవాని, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, బొందిలి, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ల చైర్మన్లు కృష్ణకిషోర్, ఆసిఫా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాకల నెరవేర్చిన ప్రభుత్వం



మాది చాలా నిరుపేద కుటుంబం. మా నాన్న సాధారణ రైతు. నాకు కజికిస్తాన్‌లో ఎంబీబీఎస్ సీటు వచ్చింది.ఇందుకోసం ఆర్థిక స్థోమత లేక వద్దనుకుంటున్న తరుణంలో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం నన్ను ఆదుకుంది. నా కలను ప్రభుత్వమే నెరవేర్చింది. ప్రభుత్వ సాయంతో బాగా చదువుకుని తిరిగి వచ్చి పేదలకు మంచి వైద్యసేవలందిస్తాను.

– సాత్విక్, ఎంబీబీఎస్ విద్యార్థి, భద్రాచలం, విడవలూరు మండలం

రాష్ట్రానికి మంచి పేరు తీసుకొస్తా



నేను ఎంబీబీఎస్ చదవడానికి కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నా ప్రతిభను గుర్తించి విదేశాల్లో డాక్టర్ కోర్సు చదివేందుకు సాయం చేసిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాను. నేను విదేశాల్లో చదువుకు వెళ్తున్నందుకు మా అమ్మా, నాన్న ఆనందానికి అవధులు లేవు. ఒక రైసుమిల్లులో పనిచేసే వ్యక్తి కుమార్తె విదేశాల్లో చదవడమంటే సాధ్యం కాదు. నా కలను నేరవేర్చిన ప్రభుత్వానికి, రాష్ట్రానికి మంచి పేరు తెస్తా.

– యాస్మిన్, ఎంబీబీఎస్ విద్యార్థి, ఖుద్దూస్‌నగర్, నెల్లూరు

12 మందికి డీటీలుగా పదోన్నతి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న 12 మంది సీనియర్ అసిస్టెంట్లకు తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్రసం.	పేరు	పనిచేస్తున్న ప్రదేశం	డీటీగా బదిలీ అయిన స్థానం
1.	పి.గిరి	టీజీపీ, నెల్లూరు	సూళ్లూరుపేట
2.	సీహెచ్ శ్యామ్	సివిల్ సప్లయిస్ ఆఫీసు, నెల్లూరు	దుత్తలూరు
3.	ఎం.నరేష్	దగదర్తి, తహసీల్దార్ కార్యాలయం	దగదర్తి
4.	సాయిప్రియాంక	టీజీపీ, నెల్లూరు	ఆర్డీఓ కార్యాలయం, సూళ్లూరుపేట
5.	శైలజ	ఆర్డీఓ కార్యాలయం, ఆత్మకూరు	వరికుంటపాడు, తహసీల్దార్ కార్యాలయం
6.	ఎం.శృతి	కలెక్టరేట్, భూసేకరణ విభాగం	రీసర్వే డీటీ, వరికుంటపాడు
7.	పి.ప్రసన్నరాణి	సైదాపురం, తహసీల్దార్ కార్యాలయం	రీసర్వే డీటీ, డక్కిలి
8.	జహీర్‌బాబు	కలెక్టరేట్, నెల్లూరు	రీసర్వే డీటీ, నాయుడుపేట
9.	బాలశంకర్ చైతన్య	చిల్లకూరు తహసీల్దార్	రీసర్వే డీటీ, సూళ్లూరుపేట
10.	పి.శిరీష	తిరుపతి, కలెక్టరేట్	పెళ్లకూరు డీటీ
11.	హసీనాబేగం	జలదంకి, తహసీల్దార్ కార్యాలయం	రీ సర్వే డీటీ, వింజమూరు
12.	ఎ.గీత	ఆర్డీఓ ఆఫీస్, కావలి	రీసర్వే డీటీ, డీవీసత్రం

నెల్లూరులో సీబీఐ అధికారులు

నెల్లూరు (క్రైమ్): ఓ కేసులో నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను అమలు చేసేందుకు చెన్నై సీబీఐ, ఏసీబీ అధికారులు శుక్రవారం నెల్లూరుకు వచ్చారు. సదరన్ రైల్వేలో డివిజనల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పీవీ రెడ్డిపై మధురై సెకండ్ అడిషినల్ డిస్ట్రిక్ట్ జడ్జి (సీబీఐ కేసులు) నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. సదరు పీవీరెడ్డి నెల్లూరు నగరంలో నివాసం ఉంటున్నారన్న సమాచారం అందుకున్న ఇద్దరు సీబీఐ అధికారులు శుక్రవారం నెల్లూరుకు చేరుకుని అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడు షార్ కాలనీలో ఉన్నాడని గుర్తించిన అధికారులు అక్కడికి వెళ్లి విచారించే క్రమంలో స్థానికులతో వారికి చిన్న పాటి ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో అధికారులు వేదాయపాళెం పోలీసుస్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయాన్ని స్థానిక పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక పోలీసుల సహకారంతో పీవీరెడ్డి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఆయన మాగుంటలేఅవుట్ ప్రాంతంలో ఉంటున్నాడని తెలిసి అతని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించేందుకు సదరు అధికారులు నిరాకరించారు.

కళాతపస్వికి సింహపురితో బంధం

నెల్లూరు (బృందావనం): భారతీయ చలనచిత్ర రంగంలో తనకంటూ ఓ విశిష్ట గుర్తింపు తెచ్చిన చిత్రాలను నిర్మించి కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్‌కు సింహపురితో దాదాపు ఐదు దశాబ్దాలకుపైగా అనుబంధం ఉంది. గురువారం రాత్రి 'కళాతపస్వి' తుదిశ్వాస విడిచారన్న విషయం తెలియగానే కళారంగానికి వెన్నుదన్నుగా నిలిచే సింహపురి మూగబోయింది. ఆ మహాదిగ్గజ దర్శకుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కలత చెందింది. దాదాపు 42 ఏళ్ల క్రితం 1980 ఫిబ్రవరి 2న నెల్లూరు మాధవ్ థియేటర్‌లో 'శంకరాభరణం' చిత్రం శతదినోత్సవ వేడుకలు జరిగాయి. ఆ వేడుకలకు సోమయాజులు, మంజుభార్గవి తదితరుల నటీనటులతో వచ్చారు. నెల్లూరీయుడు భారతీయ చలనచిత్ర సుప్రసిద్ధ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 1994–95లో నిర్మించిన శుభసంకల్పం చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు.

సాంబమూర్తి విగ్రహావిష్కరణకు నెల్లూరు రాక

2015 అక్టోబరు 3న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రి శ్రీపతిపండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహావిష్కరణ నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్రమంతో పాటు అదే రోజు స్వచ్ఛభారత్‌ను ప్రారంభించి ఏడాది గడిచిన సందర్భంగా జరిగిన స్వచ్ఛభారత్ ర్యాలీ, 'స్వచ్ఛ సంగీతం' కార్యక్రమాల్లో నాటి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, కమలహాసన్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఆయన మాతృమూర్తి శకుంతలమ్మ, తదితరులతో కలిసి విశ్వనాథ్ పాల్గొన్నారు. సాంబమూర్తి జీవిత సంగ్రహాన్ని వివరిస్తూ ముద్రించిన 'ఇదీ సాంబమూర్తి గారి కథ' పుస్తకావిష్కరణలో విశ్వనాథ్ భాగస్వాములయ్యారు.



సాంబమూర్తి విగ్రహావిష్కరణలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాతృమూర్తి, తన పిన్నమ్మ శకుంతలమ్మతో విశ్వనాథ్ (ఫైల్)

నెల్లూరులో షూటింగ్ చేశారు

1990లో కస్తూర్బాకళాక్షేత్రంలో 'సిరిమువ్వల సింహనాదం' చిత్రనిర్మాణం జరిగింది. ఈ చిత్రానికి విశ్వనాథ్ దర్శకత్వం వహించారు. నా కుమార్తె వీరిశెట్టి భవానీదుర్గ నటించింది. దర్శకుడు విశ్వనాథ్‌కు బాలసుబ్రహ్మణ్యం తల్లి శకుంతలమ్మ పిన్నమ్మ అవుతారు. ఆమె నా కుమార్తెకు అవకాశం ఇవ్వమన్నారు.

– వీరిశెట్టి హజరత్‌బాబు

నీలకంఠం అని పిలిపించుకో అన్నారు

2017 డిసెంబరు 10న అమర గాయకుడు ఘంటసాల 95వ జయంతి జరిగింది. విశ్వనాథ్ హాజరై ఆత్మీయ పురస్కారం అందుకున్నారు. హరిహరుల పేరు పెట్టుకున్న నీవు 'నీలకంఠం' అని పిలిపించుకో అన్నారు. పచ్చళ్లంటే ఎంతో ఇష్టమన్న విషయం తెలుసుకుని ప్రత్యేకంగా ఆరు రకాల పచ్చళ్లు ఆ మహానుభావుడికి పంపడం మరిచిపోలేను.

– నీలకంఠం శ్రీనివాసులురెడ్డి

శంకరాభరణంతో ఆయన అభిమానులమయ్యాం

నా పదహరేళ్ల వయస్సులో మా కుటుంబమంతా కలిసి శంకరాభరణం చూశాం. ఆ నాటి నుంచి మేమంతా ఆయన అభిమానులమయ్యాం. ఆయన నెల్లూరు ఎప్పుడొచ్చినా కలిసేవాడిని. అభిమానులుగా ఆయన దగ్గరకు ఎప్పుడెళ్లినా అదే ఆప్యాయ పలకరింపు, ఆదరణ చూపేవారు.

– పొబోలు సత్యనారాయణ

నా పాటలు విని అభినందించారు

హైదరాబాద్ ఫిల్మ్‌సిటీలో విశ్వనాథ్ ఉండగా 2021 అక్టోబరు 13న ఆయన దర్శకత్వం వహించిన చిత్రాల్లోని ఎనిమిది పాటలు ద్విగళంతో పాడగా స్వయంగా విన్నారు. వాణీ జయరాం గొంతును అనుకరించడంపై అభినందించారు.

– రామచంద్రరావు, ద్విగళ గాయకుడు

అదే జోరు.. అదే హోరు

- రసవత్తరంగా సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు



నెల్లూరు ఏసీ స్టేడియంలో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జరుగుతున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) క్రికెట్ పోటీలు నాలుగో రోజు శుక్రవారం కూడా అదే జోరు, అదే హోరుతో సాగాయి. విజయం కోసం ఇరుజట్లు పోటీపడ్డాయి. ఈ పోటీలకు అంపైర్లుగా విష్ణు యాదవ్, రమేష్‌రెడ్డి, స్కోరర్‌గా వై.యామిని వ్యవహరించారు.

నేటి మ్యాచ్‌లు

టోర్నీలో శనివారం ఉదయం 8 గంటలకు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల జట్లు పోటీ పడతాయి.
10 గంటలకు ఆదిశంకర జూనియర్ కాలేజీ, వివేకానంద జూనియర్ కాలేజీ జట్లు తలపడనున్నాయి.



గెలుపొందిన నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

మొదటి మ్యాచ్‌లో జగన్స్ డిగ్రీ, పీజీ కళాశాల, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల(నెల్లూరు) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నారాయణ ఇంజినీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన జగన్స్ డిగ్రీ, పీజీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 68 పరుగులు సాధించింది. దీంతో నారాయణ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 25 పరుగుల తేడాతో విజయం సాధించింది. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల జట్టులో దుర్గాప్రసాద్ 28 బంతుల్లో 3 సిక్సర్లు, 2 ఫోర్లతో 39 పరుగులు, సాయిచైతన్య 22 బంతుల్లో 2 సిక్సర్లు, 3 ఫోర్లతో 36 పరుగులు, రోహిత్ నాలుగు బంతుల్లో 2 ఫోర్లతో 10 పరుగులు సాధించగా, బౌలర్లు హర్షద్, వినయ్ చెరో రెండు ఓవర్లు వేసి కీలకమైన 4 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.



గెలుపొందిన ఎన్‌బీకేఆర్ కళాశాల జట్టు

రెండో మ్యాచ్‌లో ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల (విద్యానగర్) జట్టు, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల(గూడూరు) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 71 పరుగులు సాధించింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసింది. ఎన్‌బీకేఆర్ జట్టులో మహేష్ 2 ఓవర్లలో 13 పరుగులు ఇచ్చి 2 వికెట్లు, శివారెడ్డి 2 ఓవర్లు చేసి 8 పరుగులు ఇచ్చి వికెట్ పడగొట్టారు. దీంతో ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 26 పరుగుల తేడాతో గెలుపొందింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- మూడు సవర్ల బంగారం, రూ.60 వేల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

మనుబోలు : ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మనుబోలు బీసీ కాలనీలో శుక్రవారం వెలుగుచూసింది. కాలనీలో నివాసముంటున్న ఎస్కే మెహబూబ్‌బాషా గూడూరులోని చాయ్ దుకాణంలో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తన కంటి ఆపరేషన్ కోసం భార్య హసీనాతో కలిసి మంగళవారం తిరుపతికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు గ్రిల్స్ తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు బంధువులకు తెలపగా వారు దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటిని పరిశీలించి క్లూస్ టీంకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. మూడు సవర్ల బంగారం, రూ.60 వేల నగదు ఉన్నట్లుగా బంధువులు తెలిపారు. ఇంటి యజమాని మొహబూబ్ బాషాకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నిందితుడి పరారీపై ఏఎస్పీ విచారణ

సంగం : గొలుసు చోరీ కేసులో ప్రధాన నిందితుడు ఎ.గిరి సంగం బీరాపేరువాగులో దూకి పరారైన ఘటనపై జిల్లా అడిషనల్ క్రైం ఎస్పీ ప్రసాద్ శుక్రవారం సంగంలో విచారణ చేపట్టారు. నెల్లూరు సీసీఎస్ బృందం పోలీసులు గొలుసు చోరీ కేసులో గిరిని విచారణ నిమిత్తం ఏఎస్‌పేటకు తీసుకెళ్లి వస్తుండగా కారు డోరు తీసుకుని బీరాపేరులో దూకి పరారైన విషయం విదితమే. దీంతో శుక్రవారం సైతం నిందితుడి ఆచూకీ కోసం గాలించినా జాడ తెలియకపోవడంతో ఏఎస్పీ క్రైం ప్రసాద్ బీరాపేరువాగు సమీపంలో విచారణ చేశారు.

నిందితుడిపై కేసు నమోదు

చోరీ కేసులో ప్రధాన నిందితుడు గిరిపై గురువారం అర్ధరాత్రి సంగం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. నెల్లూరు సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ బుధవారం నిందితుడిని ఏఎస్‌పేటలో విచారణ చేసి తిరిగి వస్తుండగా పరారయ్యాడని సంగం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి రవాణా కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

నెల్లూరు(లీగల్) : గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా మొదటి అదనపు జడ్జి సత్యవాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని గూడూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న బూదనం టోల్‌ప్లాజా వద్ద గతేడాది జనవరి 22న విజయవాడ నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఉదయం 5 గంటల సమయంలో గూడూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. బస్సులో అనుమానాస్పదంగా ఉన్న కేరళ రాష్ట్రం, పుట్టంబేడు గ్రామానికి చెందిన కుట్టన్ నాడార్ సత్యంకు చెందిన మూడు బ్యాగులను తనిఖీ చేయగా ఆరు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో నాడార్ సత్యంను అదుపులో తీసుకుని విచారించి, కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ మేరకు కోర్టులో చార్జ్‌షీటు వేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాట్ల రమణారెడ్డి వాదించారు.

ఆక్వారంగానికి మంచి రోజులు

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



మాట్లాడుతున్న బీద మస్తాన్‌రావు

నెల్లూరు(బారకాసు) : ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభంలో ఉన్న ఆక్వారంగానికి మంచి రోజులు రానున్నాయని బీఎమ్మార్ హేచరీస్ అధినేత, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆక్వారైతుల ఆత్మీయ సదస్సును బీఎమ్మార్ హేచరీస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో బీఎమ్మార్ సంస్థ, హింటర్ గ్రూప్ సాంకేతిక సహకారంతో నూతన వెనామీ ఫీడ్ బీఎమ్మార్ భరోసాను రూపొందించినట్లు వివరించారు. ఆక్వా రైతుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ వినియోగాన్ని తక్కువ ధరకే అందిస్తున్నట్లు వివరించారు. ఆక్వారైతులకు తక్కువ ధరకే సీడ్, ఫీడ్‌ను అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగానే బీఎంఆర్ హేచరీస్ సంస్థ ద్వారా రైతు భరోసా కేంద్రాల నుంచి బీఎమ్మార్ భరోసా వెనామి రొయ్యల మేతను రూ.67కే అందించబోతున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా తక్కువ ధరకే బీఎమ్మార్ భరోసా వెనామి ఫీడ్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సదస్సులో హింటర్ గ్రూప్ ప్రతినిధి లిబుడిహర్ట్, ఆంధ్రప్రదేశ్ అక్వా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డి, హనుమంతురావునాయుడు, తిరుపతి జిల్లా అక్వా రైతు సంఘం నేతలు వెంకురెడ్డి, శ్రీనాథరెడ్డి, మధుసూదనరెడ్డి, వెంకటరెడ్డి, డాక్టర్ రవికుమార్, ప్రముఖ అక్వా కన్సల్టెంట్లు, బీఎంఆర్ సంస్థ డైరెక్టర్లు పాల్గొన్నారు.

బొల్లినేనిలో ల్యాంప్ లైటింగ్, క్యాపింగ్ సెర్మనీ

నెల్లూరు రూరల్ : రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురంలో ఉన్న బొల్లినేని నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్, క్యాపింగ్ సెర్మనీ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. కిమ్స్ ఆస్పత్రి న్యూరాలజిస్ట్ సంఘమిత్ర, నెల్లూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు చెందిన కవిత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల సీఈఓ శివమాల, ప్రిన్సిపల్ అశోక్ పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



ల్యాంప్‌లైటింగ్ కార్యక్రమంలో అతిథులు

జాతీయ స్థాయి తైక్వాండో క్రీడాకారుల ఎంపిక



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ అబ్దుల్ సలామ్

కందుకూరు రూరల్ : విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లిలో జనవరి 29 నుంచి 31వ తేదీ వరకు జరిగిన అంతర్ జిల్లాల క్యాడెట్, జూనియర్, సీనియర్ బాల, బాలికల పోటీల్లో పలువురు క్రీడాకారులు పతకాలు సాధించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి, జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ ఎస్‌కే.అబ్దుల్ సలామ్ తెలిపారు. క్యాడెట్ విభాగంలో జీ.వరుణ్ చౌదరి, పి.స్టీఫెన్ జాన్ పాల్, వి.జోయల్ క్రిస్టఫర్, ఐ.శ్రావ్య, పి.మేరీ స్టెల్లా, బీఎల్ అక్షర బంగారు పతకాలు సాధించారు. వీరు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జూనియర్ విభాగంలో జీ.శివనాగసాయిప్రియ బంగారు పతకం సాధించి ఈనెల 2, 3, 4వ తేదీల్లో విశాఖపట్నంలోని పోర్ట్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. సీనియర్ విభాగంలో.. పి.అఖిల్, జె.ముఖేష్ కుమార్, వి.మనీష బంగారు పతకాలు సాధించారు. వీరు ఈనెల 10, 11, 12లో పుదుచ్చేరిలో జరిగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, గౌరవాధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు, కోచ్ ఎస్‌కే అబ్దుల్ సలాం అభినందించారు.

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్:	రూ.97
లేయర్	రూ.80
బ్రాయిలర్ చికెన్:	రూ.176
స్కిన్‌లెస్ చికెన్:	రూ.196
లేయర్ చికెన్:	రూ.136

నిమ్మధరలు (కిలో. రూ)

పెద్దవి: 36 సన్నవి: 24
పండ్లు: 9

పనితీరు మెరుగు పడకుంటే చర్యలు తప్పవు

- ఉగాదిన గృహ ప్రవేశాలకు సీఎం వస్తారు
- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు

నెల్లూరు (పొగతోట): గృహ నిర్మాణాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జేసీ రోణంకి కూర్మనాథ్‌తో కలిసి నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఆర్డీఓలు, ఎంపీడీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పనితీరు మెరుగు పరుచుకోని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉగాది రోజున జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి గృహ ప్రవేశాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఈలోపు 16 వేల గృహ నిర్మాణాలను పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి స్వయం సహాయక గ్రూపు సభ్యులకు (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు మంజూరు చేసే నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రుణాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖలు ఇస్తున్న గృహ నిర్మాణాల సంఖ్యలో వ్యత్యాసం ఉందన్నారు. ఒక్కొక్క శాఖ మధ్య 700 గృహ నిర్మాణాల తేడా కనిపిస్తుందన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పూర్తయిన గృహ నిర్మాణాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తయిన నిర్మాణాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గడిచిన రెండు వారాలుగా గృహనిర్మాణాల్లో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇటుకలు, సిమెంట్ గృహ సామగ్రి అందుబాటులో ఉందన్నారు. రాబోవు 45 రోజులు అత్యంత కీలకమని, నిర్దేశించిన గృహ నిర్మాణాల లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. 12 వేల గృహ నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. రాబోవు 15 రోజుల్లో కనీసం 6 వేల గృహాల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. లేఅవుట్లలో ఇటుకల నిర్మాణాలు చేపట్టి ఇతర జిల్లాలకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. అనేక ప్రాంతాల్లో ఇల్లు మంజూరై రెండేళ్లు దాటినా నిర్మాణాలు మొదలు పెట్టలేదన్నారు. అటువంటి వాటిని రద్దు చేయాలని దానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలన్నారు. పనిచేయని ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి శనివారం లేఅవుట్లలో పర్యటించి అధికారులందరూ నిర్మాణాలు పురోగతికి కృషి చేయాలన్నారు. పీఎంఈవై కింద జిల్లాకు 13,119 గృహాలు మంజూరు చేశారన్నారు. వాటిలో 888 గృహాలకు జియో ట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణాల సంస్థ పీడీ వెంకటదాస్, నుడా వీసీ బాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు మలోలా, శీనానాయక్, కరుణకుమారి, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావ్, రవీంద్ర, ఎస్ఎస్ఏ పీఓ ఉషారాణి, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, పాల్గొన్నారు.